క్లుప్తంగా

గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

ఆదోనిఅర్బన్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి సుజాత శుక్రవారం తెలిపారు. 14వ తేదీన మాజీ ప్రధాని చాచా నెహ్రూ జయంతి పురస్కరించుకుని పిల్లలుచే వివిధ వేషధారణ దుస్తులతో ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 15న పుస్తక ప్రదర్శన, స్వాతంత్ర్య కథలు పుస్తకాల ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 16న స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధుల గురించి ప్రముఖుల ప్రసంగాలు, 17న భారత స్వాతంత్రోద్యమం గురించి కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. 18న విద్యార్థులకు భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రపై పోటీలు నిర్వహిస్తామని, 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో మహిళల పాత్రపై పోటీలు, 20న వుయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా స్వీయ పఠనం నిర్వహణతో 56వ గ్రంథాలయ వారోత్సవాలు ముగుస్తాయన్నారు.

ఎస్టీయూ నాయకురాలి మృతి


సబిరున్నిషా (ఫైల్)

ఆదోనిసెంట్రల్: ఎస్టీయూ సీనియర్ నాయకురాలు సబిరున్నిషా అకాల మరణం సంఘానికి తీరని లోటని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, వీరచంద్రయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు శుక్రవారం మాట్లాడుతూ 1989లో ఉద్యోగ ప్రస్థానంలో చేరి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. బోధన విధానంలో ఆమె చూపిన చొరవకు జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులను పొందినట్లు పేర్కొన్నారు. ఎస్టీయూ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని తెలిపారు. ఆమె అకాల మరణం పట్ల ఎస్టీయూ నాయకులు లోక్యనాయక్, రమేష్ నాయుడు, ప్రహ్లాద్ తదితరులు ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


విద్యార్థి పఠనా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ -2 నాగేశప్ప

కోసిగి: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈఓ–2 నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దభూంపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా నాడు–నేడు కింద నిర్మించిన అదనపు భవనాలు, ఫర్నీచర్స్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, వసతులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల రికార్డులు, హాజరు పట్టికను చెక్ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నేరుగా పరీక్షించారు. విద్యార్థుల వయసు ఆధారంగా ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీఆర్‌పీలు వెంట ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా చీఫ్ కోచ్ శ్రీనివాసులు

ఆదోనిసెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై పీడీ, పీఈటీలకు అవగాహన సదస్సును జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరిగే పోటీలను విజయవంతం చేయాలని కోరారు. క్రీడలకు సంబంధించిన విధి విధానాలను, వివిధ అంశాలను తెలిపారు. ఫిజికల్ డైరెక్టరు కంబిరెడ్డి, ఖోఖో కోచ్ భూపతి, ఇర్ఫాన్ ఆదోని డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

కోసిగి: మండల కేంద్రం కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ సమక్షంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో సైన్స్ సంబరాల్లో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు సైన్స్ పరిజ్ఞానం పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వం నేర్చుకోవాలని, అప్పుడు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవచ్చునన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు అనంతయ్య, గురుస్వామి, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కే జనం మద్దతు

- టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- 'ఏపీకి జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి' సభలో వై.బాలనాగిరెడ్డి
- పెద్దకడబూరులో అట్టహాసంగా పార్టీ శ్రేణులతో ర్యాలీ


సచివాలయంలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: వచ్చే ఎన్నికల్లో సీటు వస్తుందో? రాదో? తెలియని టీడీపీ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డిని నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎద్దేవా చేశారు. పెద్దకడబూరులో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూలు నుంచి భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణ సమీపంలోని ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం షాదీఖానాలో సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచినా బాలనాగిరెడ్డి అభివృద్ధి చేయలేదని టీడీపీ నాయకులు ప్రచారం చేయడం విడ్డూరకరమన్నారు. రెండు పర్యాయాలు ప్రతిపక్షంలో ఉండటంతో ప్రజలకు న్యాయం చేయలేకపోయానని, వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉంటూ నీరు–చెట్టు పథకంలో తిక్కారెడ్డి ఎంత దోచుకున్నాడో ప్రజలకు తెలిసిందేనని ఆరోపించారు. మోసాలు చేయడంతో తిక్కారెడ్డి జైలుకు కూడా వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు పొత్తులతో పోటీకి వచ్చినా అధికారంలోకి రావడం కలేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగనన్న నేతృత్వంలో విజయ ఢంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళదాం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన ప్రగతిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళాదామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు శక్తివంచన లేకుండా శ్రమించాలని సూచించారు. ముఖ్యంగా ఎవ్వరూ ఓటు హక్కు కోల్పోకుండా బూత్ కమిటీలు కృషి చేయాలని చెప్పారు. పెద్దకడబూరులో సంక్షేమం, ప్రగతి కోసం రూ.170 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో ప్రగతి బోర్డును ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, మాజీ ఎంపీపీ రఘురాం, ఉరకుంద ట్రస్టుబోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, సర్పంచు రామాంజినేయులు, సీఐ ఎరిషావలి, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ జనార్దన్, నాయకులు గజేంద్రరెడ్డి, ఈరన్న, ముక్కరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు


మండిగిరి దమ్మర కాలనీలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయతీలోని రాజీవ్‌గాంధీ నగర్, దమ్మరగేరి కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 400కు పైగా గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా? కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? మంచినీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎంపీపీ పంపాపతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

మండిగిరి సచివాలయం–2 పరిధిలోని తిరుమల నగర్‌లో 'ఏపీకి జగనన్నే మళ్లీ సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన వారి గుండెల్లో సీఎం జగన్ స్థానాన్ని బయటపెడుతోందన్నారు. నాలుగు సంవత్సరాల పరిపాలనలో జగన్ ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చారని వివరించారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

ఆదోనిటౌన్: 'మా నమ్మకం నువ్వే జగనన్న' మళ్లీ మీరే అధికారంలోకి రావాలి సంక్షేమ పథకాలు కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ మొదటి, రెండో క్లస్టర్ల అధ్యక్షులు దేవా, మహ్మద్‌స్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. 2024లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఎందుకు కావాలనే అంశంపై వార్డు ప్రజలు, పార్టీ శ్రేణులతో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014లో 600 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేశారని అందులో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్లలో హామీలన్నీ నెరవేర్చారని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలా వద్దా అని మధుసూదన్‌శర్మ, దేవా ప్రశ్నించగా మహిళలు, స్థానికులు ముక్తకంఠంతో జగననే సీఎం కావాలంటూ బదులిచ్చారు. కౌన్సిలర్లు వసీం, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీయాదవ్, మాజీ కౌన్సిలర్ అల్తాఫ్, పార్టీశ్రేణులు, వీధి పెద్దలు పాల్గొన్నారు.


కోసిగిలో వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణ చేస్తున్న పార్టీ శ్రేణులు

చంద్రబాబు నాటకాలను ప్రజలు నమ్మరు

కోసిగి: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగి సచివాలయం –1 పరిధిలోని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఉదయం ఇంటింటికీ తిరిగి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు పరిపాలన, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలను ఆరా తీయగా 90 శాతం మంది జగనన్నే మళ్లీ సీఎం కావాలని ముక్తకంఠంతో బదులిచ్చారు. సచివాలయం–2 పరిధిలో మధ్యాహ్నం కాశమ్మ గడ్డ కాలనీలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయానికి వెళ్లి సంక్షేమ పథకాలు డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. నేటి నుంచి సచివాలయం –2 పరిధిలో వారం రోజుల పాటు రోజుకు ఒక్కొక్క వలంటీర్ 15 ఇళ్ల చొప్పున సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజా మద్దతు సేకరించాలన్నారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, కోసిగయ్య, ఉస్మాన్, నాడుగేని నాగరాజు, బుళ్లి నరసింహులు, మహంతేష్‌స్వామి, రాజేష్, వలంటీర్లు పాల్గొన్నారు.


మంత్రాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి

చేసిన ప్రగతిని వివరిద్దాం

మంత్రాలయం: ప్రభుత్వ హయాంలో చేసిన ప్రగతిని ప్రతి ఒక్కరికీ వివరిద్దామని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సచివాలయం–2 పరిధిలో ఏపీకి జగనే ఎందుకు మళ్లీ సీఎం కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాఘవేంద్ర సర్కిల్‌లో పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం సచివాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికీ వివరించాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఉపసర్పంచ్ పరమేష్, మల్లికార్జున, ఎంపీడీఓ మనిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి మాధవి, నాయకులు శివకుమార్, గోరుకల్లు కృష్ణమూర్తి, వీరారెడ్డి, పాల్గొన్నారు.


కౌతాళంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


ఆదోని 11వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ సీఎం జగన్' కార్యక్రమానికి హాజరైన మహిళలు

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

కౌతాళం: వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలు అభ్యున్నతి సాధ్యమని సర్పంచ్ పాల్‌దినకర్, మండల అధ్యక్షుడు ప్రహ్లాదచారి అన్నారు. శుక్రవారం సచివాలయం –2లో ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్నే ఎందుకు మళ్లీ సీఎం కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్ల పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును గ్రామ నాయకులతో కలసి ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, అవతారం, వడ్డెరాము, పంచాయతీ కార్యదర్శులు చెన్నయ్య, అంజనేయులు సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఆదోనిసెంట్రల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 20వ తేదీలోపు నామినల్ రోల్స్ పూర్తిచేసి పాఠశాల లాగిన్‌లోకి వెళ్లి పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. గడువు దాటితే రూ. 50 నుంచి రూ.200 రూ.500 వరకు అపరాధ రుసుముతో డిసెంబర్ 15వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఫీజు చెల్లించి పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంది.

పరీక్ష ఫీజు వివరాలు

రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలి. ఫెయిలైన విద్యార్థులు మూడు కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు అండర్ ఏజ్ స్టూడెంట్స్ అంటే తక్కువ వయస్సున్న వారి ఫీజు రూ.300 చెల్లించాలి. వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

పదో తరగతి పరీక్ష ఫీజును చెల్లించేందుకు గడువును ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించింది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించి విద్యార్థుల చేత ఫీజులు కట్టించాలి. పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలి. నామినల్ రోల్స్ తయారీలో జాగ్రతలు తీసుకొని పరీక్ష ఫీజు చెల్లించాలి

– బి.శివరాములు, మండల విద్యాధికారి

నేడు విద్యుత్ కోతలు

ఆదోనిరూరల్: 33 కేవీ ఐటీసీ, పెద్దతుంబళం ఫీడర్స్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఆదోని మండల రూరల్ విద్యుత్ శాఖ ఏఈ చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దతుంబళం, సంతెకూడ్లూరు, గణేకల్, బల్లేకల్, జాలిమంచి, కుప్పగల్, బైచిగేరి, ఆరేకల్, కపటి, నాగలాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల అనంతరం యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

మంత్రాలయం: మండల పరిధిలోని తుంగభద్ర, మంత్రాలయం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని ఫీడర్‌లకు శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గోవిందు తెలిపారు.

కోసిగి: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్, మరమ్మతులు, మాధవరం సబ్‌స్టేషన్ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌతాళం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో వివిధ మరమ్మతులు పనులు చేపట్టేందుకు వీలుగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నరసన్న తెలిపారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్. మురవణి, పెద్దకడబూరు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గోవిందు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

ఎమ్మిగనూరురూరల్: రాబోవు ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ నరాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ భవనంలో తాలుకా స్థాయి సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా ఇప్పటి నుంచే ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ కేంద్రాలు, ఇతర సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. సమయం ఉంది కదా అని నిర్లక్ష్యం చేస్తే తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? పరిశీలించి ఏమైనా ఇబ్బందులుంటే సరిచేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావలసి ఉంటుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్, ఎన్నికల డీటీ గురురాజరావు, సెక్టోరల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: కంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని కంటి చూపును మెరుగుపరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైద్యశిబిరం నిర్వాహకులు విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ పాఠశాలలో గత నెలలో దాతలు అర్థగేరి రామకృష్ణారెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం ప్రవాస భారతీయులు ప్రేమసాగర్‌రెడ్డి, శాంతిరెడ్డి ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేసి అవసరమైన వారికి మళ్లీ పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి మొబైల్ ఆపరేషన్ వాహనాలు ఏర్పాటు చేసి కంటి చికిత్సలు చేయడం జరిగిందన్నారు. మరింత మందికి చైన్నైలోని శంకర నేత్రాలయ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామాంజులు, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల వేలంలో పెరిగిన ఆదాయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ హక్కుల కోసం శుక్రవారం జరిగిన వేలం పాటలో దేవాలయానికి ఆదాయం స్వల్పంగా పెరిగింది. ఒక ఏడాది పాటు తలనీలాల సేకరణ హక్కు కోసం జరిగిన వేలంలో హిందుపురానికి చెందిన రాజ ఎంటర్‌ప్రైజస్ వారు రూ.1.63 కోట్లకు హక్కులను దక్కించుకున్నారు. గతంలో తలనీలాల టెండరు రూ.1.59 కోట్లు పలికింది. వేలం దక్కించుకున్న వారు ఏడాది పాటు హక్కులను పొందుతారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. అలాగే దేవస్థాన పాత కార్యాలయ పరిపాలన భవనం కూల్చివేసేందుకు బహిరంగ వేలం నిర్వహించగా సురేష్‌కుమార్ రూ.3.44 లక్షలకు దక్కించుకున్నారు. కర్నూలు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

ఆదోనిరూరల్: మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన కురువ బసవరాజు (15) అనే విద్యార్థి అదృశ్యమైనట్లు తండ్రి సుంకన్న శుక్రవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. విద్యార్థి బసవరాజు కర్నూలు వద్ద పెద్దపాడు బీసీ హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుకు గ్రామానికి వచ్చాడు. సెలవులు ముగిసిన తర్వాత గత నెల 28వ తేదీన పెద్దపాడులోని హాస్టల్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే విద్యార్థి హాస్టల్‌కు రాలేదని పెద్దపాడు బీసీ హాస్టల్ వార్డెన్ విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి తెలియజేశాడు. కుటుంబసభ్యులు బంధువులకు సమాచారం అందించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎల్లెల్సీ నీరు జీడీపీకి మళ్లింపు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీటిని జీడీపీ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టులోకి మళ్లించారు. శుక్రవారం నీటి పారుదల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి గోనెగండ్లలోని ఎస్కెప్ చానల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు దాదాపు 200 క్యూసెక్కుల నీరు వస్తోందని, తాగునీటి అవసరాల కోసం 104 క్యూసెక్కుల నీటిని ఎస్కెప్ ఛానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు మళ్లించడం జరిగిందన్నారు. జీడీపీలో ప్రస్తుతం 0.5 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా డోన్, పత్తికొండ, దేవనకొండ తదితర పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని జీడీపీలోకి మళ్లించినట్లు తెలిపారు. ఎవరైన జలచౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ లక్ష్మణ కుమార్, ఏఈ ఉదయ్ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

నంజనగూడు మఠంలో పీఠాధిపతులు


రాఘవేంద్రుల మృత్తికా బృందావనం దర్శనంలో పీఠాధిపతులు

మంత్రాలయం: కర్ణాటకలోని నంజనగూడు మఠాన్ని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, హరిహరపుర పీఠాధిపతి స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి శుక్రవారం దర్శించుకున్నారు. వేదపఠనం మధ్య హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. తరవాత పరస్పరం సన్మానాలు చేసుకున్నారు.

త్వరలో నష్టపరిహారం చెల్లిస్తాం

పెద్దకడబూరు: రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు త్వరలోనే నష్ట పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. మండల పరిధిలోని గవిగట్టు గ్రామం వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి సేకరించిన భూములను శుక్రవారం ఆమె పరిశీలించారు. రికార్డులను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ భూములు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ వీరేంద్రగౌడ్, మండల సర్వేయర్ తేజస్విని, రెవెన్యూ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు భూసేకరణ నిమిత్తం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శుక్రవారం భూములను పరిశీలించారు. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో పర్యాటక శాఖ అభివృద్ధి పనులకు భూముల కేటాయింపునకు అధికారులతో కలిసి పరిశీలన చేపట్టారు. ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సర్వేయర్లు వెంట ఉన్నారు.


ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని గువ్వమ్మ సందుకొండ ప్రాంతంలో శుక్రవారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ విలేకరులకు తెలిపారు. బోయ శ్రీనివాస్, బోయ శివ, బుడ్డి తిమ్మప్ప అనే వ్యక్తులు సారా తయారు చేస్తుండగా దాడులు నిర్వహించామన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి అక్కడే ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా క్యాన్‌ను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేసి పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

ఇజ్రాయెల్ మారణకాండ తక్షణమే ఆపాలి

ఆదోనిరూరల్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు. స్థానిక భీమాస్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తూ వామపక్ష పార్టీల నాయకులు సుదర్శన్, లింగన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు పాల్గొని మాట్లాడారు. గాజాలో మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పెద్దకడబూరు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఆపేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. యుద్ధాన్ని ఆపేసి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నాయకులు నరసప్ప, రంగస్వామి, కదుబూరి, బడేసాబ్, లక్ష్మన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


ఆదోనిలోని భీమాస్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు